క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



నరసరావుపేట రూరల్: ఆనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్ శుక్రవారం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. నకరికల్లు పీఎస్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఎస్కే మొహమ్మద్ షరీఫ్ ఈ ఏడాది మార్చి 28వ తేదీన మృతిచెందాడు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మృతుడి భార్య నూర్జహాన్ బేగ్‌కు సాయం చెక్‌ను అడిషనల్ ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి హోంగార్డు కుటుంబానికి సహాయం అందించేందుకు జిల్లాలోని హోంగార్డులు ముందుకు వచ్చి ఒక రోజు వేతనం సాయం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

వినుకొండలో ఘనంగా బ్రహ్మోత్సవాలు



వినుకొండ: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు 3వ రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అగ్నిధ్యానం, నిత్య హోమం, కుంభ పూజ, భూసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దివ్య కలాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.శ్రవణ్‌కుమార్, బొల్లాపల్లి మండలం పేరూరుపాడు గ్రామానికి చెందిన జాతీయ అవార్డు గ్రహీత, టీవీ ఆర్టిస్టులు ఈ.సాయి ఆధ్వర్యంలో భజంత్రీలు, మేళతాళాలతో వైభవోపేతంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయన అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, ప్రధాన కార్యదర్శి అచ్యుత కృష్ణసుబ్బారావు, కోశాధికారి కాళ్ల రామకోటేశ్వరరావు, గుడి మేనేజర్ వాసు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ చేతిలో కీలుబొమ్మలా ఎన్నికల కమిషన్

నరసరావుపేట రూరల్: ఎన్నికల కమిషన్ బీజేపీ చేతిలో కీలుబొమ్మలా మారి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందని ఐంఎంఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్కె మౌలాలి ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆధారాలతో ఆరోపణలు చేస్తుంటే ఎన్నికల కమిషన్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఆరు నెలల నుంచి డేటా సేకరించి కర్ణాటక రాష్ట్రంలోని మహాదేవాపురం ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను రాహుల్ గాంధీ బయటపెట్టారని వివరించారు. ఈ పార్లమెంట్ పరిధిలో లక్షమందికి పైగా నకిలీ ఓటర్లు ఉన్నారని, లక్షకు పైగా ఓట్లు మాయమయ్యాయని రాహుల్ గాంధీ ఆరోపణలు చేస్తుంటే ఎన్నికల కమీషన్ మౌనంగా ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. అంతేకాకుండా ఓటర్ మిషన్ రీ డబల్ డేటా, సీసీ టీవీ ఫుటేజ్‌ను ప్రతిపక్ష నేత అడిగితే ఇవ్వకుండా ఈసీ తాత్సారం చేయడం అనుమానాలను బలపరుస్తుందని తెలిపారు. బీహార్, మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ జరిగిన ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎంలపై కూడా ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో అక్రమాలపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందని, ప్రజలకు త్వరలోనే నిజాలు తెలుస్తాయని వివరించారు.

రైతు కుటుంబానికి ఆర్థికసాయం



నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల బీసీ కాలనీలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు నాస్యం ఆదినారాయణ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కృష్ణాజిల్లా అసిస్టెంట్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ ఎం వెంకటేశ్వర రావు, నాదెండ్ల పీఏసీఎస్ సీఈవో చేకూరి ధనలక్ష్మీ మృతుడు ఆదినారాయణ భార్య రమణకు నగదు అందించారు. రైతులు బలవన్మరణాలకు పాల్పడితే వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయని, రైతులు మనోనిబ్బరంతో సమస్యలను ఎదుర్కోవాలని సూచించారు.

కౌలు వేలం వాయిదా

నాదెండ్ల: మండలంలోని కనపర్రు గ్రామంలో కొలువైయున్న శ్రీరాజ్యలింగేశ్వరస్వామి దేవస్థాన భూముల కౌలు వేలం వాయిదా పడింది. రైతులు ఎవరూ ధరావత్తు చెల్లించకపోవటంతో శుక్రవారం జరగాల్సిన వేలం వాయిదా వేసినట్లు ఎండోమెంట్ అధికారి నిడమానూరి లక్ష్మయ్య తెలిపారు. సర్వే నెం.123లో 14.65 ఎకరాలు, 139లో 1.27 ఎకరాలు భూమి ఉండగా ఉన్నతాధికారుల సూచనల మేరకు త్వరలో తిరిగి వేలం నిర్వహిస్తామని తెలిపారు.

మహాలక్ష్మీ.. నమోస్తుతే

- ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు
- సామూహికంగా ఆచరించిన సువాసినులు



వినుకొండలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు



వినుకొండలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

వినుకొండ: పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద గల శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం శుక్రవారం వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సదావర్తి సంఘం కమిటీ ఆలయ కమిటీ అధ్యక్షులు జొన్నలగడ్డ బాబ్జి, పట్టణ పురోహితులు యడవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 310 మంది మహిళా భక్తులచే వరలక్ష్మి వ్రతం చేయించారు. గర్భగుడిలోని అమ్మవారి వరలక్ష్మి అలంకారం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో తాత సత్యనారాయణ, పెరుమాళ్ల అమర్నాథ్‌రెడ్డి, రెడ్డి నగేష్, పెండేల సురేష్, కొల్లిపర నాగేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు పొట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట ఈస్ట్: శ్రావణ మాసం రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో ఆయా ఆలయాలలో జరిగిన సామూహిక కుంకుమార్చనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తోటి మహిళలకు వాయినం సమర్పించారు. ఎన్జీఓ కాలనీలో నూతనంగా నిర్మించిన అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయం, సత్తెనపల్లిరోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలోని లక్ష్మీదేవి ఉపాలయం, పాలపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం, రామిరెడ్డిపేటలోని శ్రీసత్యసాయి మందిరం తదితర ప్రాంతాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు.




పాలపాడురోడ్డు ఆలయంలో పూజలందుకుంటున్న వరలక్ష్మీ అమ్మవారు

రొంపిచర్ల: మండలంలో మహిళలు శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీ. గృహాలను ఉదయాన్నే శుభ్రపరిచి గుమ్మాలకు తోరణాలు కట్టారు. గడపలను పసుపు, కుంకుమలతో పూజించారు. ఉదయం నుండే దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలు ధరించారు. వరలక్ష్మీ వ్రతాలు చేయడం వల్ల కోరిన కోర్కెలను లక్ష్మీదేవి ఇస్తుందని భక్తుల విశ్వాసం. వ్రతం నోచుకున్న వారు ముత్తైదువులకు వాయినాలు అందజేస్తే లక్ష్మీదేవి తమపై సంపూర్ణంగా కరుణిస్తుందని భక్తుల నమ్మకం. ముత్తైదువులకు పసుపు, కుంకుమ, ఆకు, వక్క, జాకెట్ ముక్క, గాజులు, పోసుపుకొమ్ములు, పూలు, నానబెట్టిన శెనగలు, పండ్లు, ఫలాలను వాయినాలుగా అందజేసి వారి వద్ద నుండి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

శావల్యాపురం: మండలంలో శ్రావణ రెండవ శుక్రవారం సందర్భంగా మండలంలోని,గంటావారిపాలెం, వేల్పూరు, కారుమంచి, శావల్యాపురం, పోట్లూరు, మతుకుమల్లి తదితర గ్రామాల్లో వరలక్ష్మి వ్రత వేడుకలు మహిళలు వైభవంగా నిర్వహించారు. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గామ్మ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాదెండ్ల: శ్రావణ మాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాలతో పాటూ గృహాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. గణపవరంలోని కోదండ రామాలయంలో జరిగిన వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు దర్భ అనిల్‌కుమార్, ఉమామహేశ్వర శర్మలు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. మణిదీప వర్ణన పారాయణం చేశారు.



రొంపిచర్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమ



గణపవరం కోదండరామాలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



రేమిడిచర్లలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

మహిళలకు శుభప్రదమైన శ్రావణ మాసంలో ముత్తైదువులకు ప్రసాదా లు పంపిణీ చేశారు. గృహాలను పసుపు కుంకుమ, తోరణాలతో అలంకరించారు. వివాహిత స్త్రీలు వయానాలు ఇచ్చి పుచ్చుకున్నారు. సాతులూరు రెడ్డిపేరంటాలమ్మ ఆలయంలో భక్తులు సామూహిక వరలక్ష్మీవ్రత పూజలు చేశారు. పూజారి పూర్ణాచార్య ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి కుంకుమపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



సాతులూరు రెడ్డి పేరంటాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో భక్తులు

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా గౌరీ శంకర దేవాలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం విశేష పూజలు నిర్వహించారు శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఆచరించటం మహిళలు అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మారికి ప్రత్యేక అలంకారముచేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట టౌన్: పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ఎల్.వి. ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. రెండవ శనివారం సబ్ స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా నరసరావుపేట పట్టణంలో ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలో శనివారం అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత నున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం కనుక పిడుగురాళ్ళ 220 కె.వి.విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం, సుబ్బయ్యపాలెం, బుచ్చిపాపన్నపాలెం సబ్ స్టేషన్ల పరిధిలో గల 33 కేవీ, 11 కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. త్రీఫేస్ విద్యుత్ సరఫరా శనివారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఉదయం 9 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు, గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణ పరిధిలో అన్ని ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. చిలకలూరిపేట మండలంలోని వేలూరు, కుక్కపల్లివారిపాలెం, తుర్లపాడు, సందెపూడి, పసుమర్రు, బొప్పూడి, కావూరు గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నాదెండ్ల మండలంలోని గణపవరం, వేలూరురోడ్డు, తిమ్మాపురం జాతీయ రహదారి రోడ్డు, బైపాస్ రోడ్డు, కనపర్రు, మైనంపాడు, సాతులూరు, చందవరం గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. యడ్లపాడు మండలంలోని అన్ని గ్రామాలకు గృహ, వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమలకు సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఫార్మా రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు

నోవా నారడిస్క్ సంస్థ క్లినికల్ మేనేజర్ డాక్టర్ అహ్సాన్ ఫారుక్



కార్యక్రమంలో పాల్గొన్న అట్లూరి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అహ్సాన్ పారూక్

నరసరావుపేట రూరల్: ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని నోవా నారడిస్క్ సంస్థ క్లినికల్ మేనేజర్ డాక్టర్ అహ్సాన్ ఫారుక్ తెలిపారు. ఎఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో క్లినికల్ డేటా మేనేజ్మెంట్ మెడికల్ కోడింగ్ ఫార్మ కోవిజిలెన్స్, రెగ్యులేటర్ ఎఫర్స్ విభాగాలలో ఉద్యోగ అవకాశాలు పట్ల శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ అహ్సాన్ ఫారూక్, కేఎంసీ మణిపాల్ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ అజిత్‌సింగ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అహ్సాన్ ఫారూక్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ తరహా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రోజురోజుకు మన దేశంలో పెరుగుతున్నాయని తెలిపారు. ఇందులో మెడికల్ కోడింగ్, రెగ్యులేటరీ ఎఫైర్స్, ఫార్మకో విజిలెన్స్, క్లినికల్ డేటా మేనేజ్మెంట్ ముందు వరుసలో ఉన్నాయని తెలిపారు. వీటి నూతన ఔషధాల మార్కెటింగ్ అనుమతి దశకు త్వరగా తీసుకురావచ్చని తెలిపారు. అదే విధంగా నాణ్యమైన ఔషధాల మార్కెటింగ్ అనుమతి దశకు త్వరగా తీసుకువచ్చేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. డాక్టర్ అజిత్‌సింగ్ మాట్లాడుతూ ఫార్మ కో విజిలెన్స్, క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్ వంటి రంగాల ద్వారా వ్యక్తుల పూర్తిగా ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవచ్చని తెలిపారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి మాట్లాడుతూ సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందిచుకోవడం ద్వారా బీఫార్మసీ, ఫార్మడీ విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కంపెనీలతో ఎఎంరెడ్డి కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో భూమికి బలం

- రైతులకు పెట్టుబడులు తగ్గుతాయి
- వ్యవసాయ అధికారి రామినేని రామారావు



పొలంలో సాగు చేసిన పచ్చిరొట్ట ఎరువు

శావల్యాపురం: రైతులు ఒకరికొకరు పోటీపడుతూ రసాయనిక వాడకాన్ని పెంచడంతో భూమిలో సారం పూర్తిగా తగ్గిపోతుంది. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. రసాయనిక ఎరు వుల వాడకం పెరగటం వలన భూమిలో సారం తగ్గిపోవటంతో దిగుబడులు తగ్గాయి. రైతులు పచ్చిరొట్ట ఎరువు సాగువైపు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభం ముందు రైతులు పచ్చిరొట్ట ఎరువు సాగు చేయడానికి ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన విత్తనాలను జీలుగులు, పిల్లిపెసర, జనుము.విత్తనాలు సాగుకు సమాయాత్తం అవుతున్నారు. ఎకరానికి 10 కేజీలు చొప్పున చల్లాలి. విత్తనం చల్లిన నెల రోజుల తదుపరి ఏపుగా పెరిగిన తరువాత పచ్చిరొట్టను ట్రాక్టరుతో తొక్కించి భూమిలో కలిసేటట్లు దుక్కిదున్నాలి. దీంతో మొత్తం కుళ్ళి భూమిలోకి ఇంకిపోతుంది. తర్వాత వారం రోజులకు గొర్రు,గుంటుక, రోటవేటరుతో భూమిని శుభ్ర పరుచుకుని పంట సాగు చేసుకోవాలి. పచ్చిరొట్టె సాగు చేసిన భూమల్లో పోషకాల శాతం పెరిగి రసాయనిక ఎరువులు వినియోగం పూర్తిస్థాయిలో తగ్గుతుంది. దీంతో రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగి రైతులు ఆర్థిక ప్రగతి సాధిస్తారు. నత్రజని, భాస్వరం, పొటాష్ సేంద్రియ రూపంలో భూమిలో కలిసిపోతాయి. ప్రస్తుతం రైతులు వినియోగించే రసాయనిక ఎరువులు వలన వాతావరణంలో కాలుష్యం పెరిగి మానవాళికి పెనుముప్పు వాటిల్లుతుంది. రైతుల్లో చైతన్యం పెరిగి అధికంగా సేంద్రియ ఎరువు పచ్చిరొట్ట సాగు చేయాలని అధికార యంత్రాంగం సూచిస్తోంది.

రాయితీపై విత్తనాలు మంజూరు చేస్తున్నాం

రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను అన్నీ 50 శాతం రాయితీపై జిలుగులు, జనుము, పిల్లిపెసర తదితర విత్తనాలను అర్హత కల్గియున్న రైతులకు మంజూరు చేశాం. వాటిని సద్వినియోగం చేసుకుని పచ్చిరొట్ట ఎరువు సాగు వైపు ఆసక్తి చూపాలి. పచ్చిరొట్ట ఎరువు సాగు చేయటం ద్వారా భూమిలో కావల్సిన అన్నీ రకాల పోషకాలు సమృద్ధిగా లభ్యమవుతాయని తద్వారా రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు.

–రామినేని రామారావు, మండల వ్యవసాయ అధికారి, శావల్యాపురం

గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న శ్రీనునాయక్

చిలకలూరిపేట: గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు పరచటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి శ్రీనునాయక్ విమర్శించారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అందరి కంటే అన్ని విధాలుగా దోపిడీకి గురి అవుతున్నది గిరిజనులేనని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య,వైద్యం, ఉపాధి, ఆర్థిక అసమానతల గురించి అవగాహన లేక గిరిజన ప్రజలు వెనుకబడి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా గిరిజన ప్రజల తలరాతలు మారడం లేదన్నారు. గిరిజనుల స్థితిగతులను అధ్యయనం చేసిన ఐక్యరాజ్యసమితి ఏడు అంశాలపై తీర్మానం చేసిందని తెలిపారు.

స్వయంగా నిర్ణయం తీసుకొనే హక్కు, వివక్ష నుంచి కాపాడుకొనే హక్కు, సమాజంలో అందరితో పాటు మనుగడ సాగించే హక్కు వంటి కల్పించాలని తీర్మానం చేసిందన్నారు. గిరిజన హక్కుల కోసం అనేక మంది నాయకులు చేసిన పోరాట ఫలితంగా 1993 ఆగస్టు 9న గిరిజన దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం సీపీఐ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్న గిరిజన దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కంటి వైద్యుడు నల్లమోతు ప్రసాదరావు మృతి



చిలకలూరిపేట: సీనియర్ కంటి వైద్యుడు, రాయుడు కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ నల్లమోతు ప్రసాదరావు (75) అనారోగ్యంతో శుక్రవారం కన్ను మూశారు. కొన్ని రోజుల కిందట అనారోగ్యానికి గురికాగా గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్య శాలలో చికిత్స తీసుకుంటూ అక్కడే తుది శ్వాస విడిచారు. పట్టణంలోని సుబ్బయ్య తోటలో రాయుడు కంటి ఆసుపత్రి స్థాపించి గత నాలుగు దశాబ్దాలుగా మంచి హస్తవాసిగల కంటి వైద్యుడిగా గుర్తింపు పొందారు. ఆయనకు భార్య ఆదిశేషమ్మ, వైద్యులైన ముగ్గురు కుమారులు మురళీచంద్, రతన్ కిషోర్, రఘువీర్‌లు ఉన్నారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న పట్టణానికి చెందిన డాక్టర్లు, ఐఎంఏ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శుక్రవారం తెలిపారు. కంభంపాలెంకు చెందిన గద్దం సలోమీను షాలెంనగర్‌కు చెందిన ఎనుబర్ల సురేష్ గత కొంతకాలంగా వేధిస్తున్నాడు. గురువారం రాత్రి ఆమె ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

నరసరావుపేట టౌన్: విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శుక్రవారం తెలిపారు. బరంపేటకు చెందిన గోనం వెంకటేశ్వర్లు (46) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. రామిరెడ్డిపేట ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లో కరెంట్ పని చేసేందుకు గురువారం వెళ్లాడు. అక్కడ విద్యుత్ షాక్‌కు గురై స్పృహ కోల్పోయాడు. గమనించిన బిల్డింగ్ యజమాని జంబుల నరసింహారావు కరెంట్ షాక్‌కు గురైన వెంకటేశ్వర్లును సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి సోదరుడు గోనం చంద్రశేఖర్‌రావు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వినుకొండలో చైన్ స్నాచింగ్

- హెల్మెట్ ధరించి సినీ ఫక్కీలో చైన్‌స్నాచింగ్
- అత్యంత రద్దీగా ఉండే వినుకొండ మెయిన్‌బాజారులో ఘటన

వినుకొండ: శ్రావణమాసం వరలక్ష్మీవ్రతం సందర్భంగా అమ్మవారి గుడికి వెళుతున్న మహిళ మహిళమెడలో బంగారం దోచుకెళ్లిన ఘటన వినుకొండలో కలకలం రేపింది. సేకరించిన వివరాలప్రకారం పట్టణంలోని మెయిన్‌బజారుకు చెందిన మహిళ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంకు వెళుతుండగా హెల్మెట్ ధరించిన యువకుడు చాకచక్యంగా మహిళ మెడలోని బంగారం లాక్కెళ్లాడు. అందరూ చూస్తూండగానే ఘటన జరగడంతో షాక్‌కు గురైయ్యారు. సినిమాఫక్కీలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడటం చూసి ఆశ్చర్యపోయారు. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే దొంగను పట్టుకునే వీలు ఉందని అంటున్నారు. ఇటీవల కాలంలో వినుకొండ టౌన్‌లో ఇరువురు మహిళలను బంగారం కోసం హత్య చేశారు. మళ్లీ అత్యంత రద్దీగా ఉండే మెయిన్ బజారులో దొంగతనం జరుగటంతో బంగారం ధరించి బయటకు వెళ్లాలంటే మహిళలు భయపడుతున్నారు. బంగారం విలువ 5 లక్షలకు పైగా ఉంటుందని అంచనా

వినుకొండలో ముగిసిన సీపీఐ మహాసభలు



మాట్లాడుతున్న ముప్పాళ్ల

వినుకొండ: భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా 100 ఏళ్ల శత జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో పోరుషాలకు మారుపేరైన పల్నాడు జిల్లా సీపీఐ రెండవ మహాసభలు వినుకొండలో నిర్వహించుకోవడం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వర రావు అన్నారు. వినుకొండలో జరుగుతున్న సీపీఐ జిల్లా మహాసభల్లో రెండవ రోజు శుక్రవారం ప్రతినిధుల మహాసభ సందర్భంగా ముందుగా విలేకరుల సమావేశంలో ముప్పాళ్ళ మాట్లాడారు. 28వ సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో ఈనెల 23వ తేదీ నుండి ప్రారంభమవుతాయని, ఇదే హుషారు, ఇదే చైతన్యంతో ఒంగోలు రాష్ట్ర మహాసభలకు పల్నాడు జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీకి ఎంతో ఉద్యమ చరిత్ర ఉందని, పెట్టుబడిదారీ వ్యవస్థపై నిరంతరం పోరాటం సాగిస్తూనే ఉన్నదన్నారు. 140 కోట్ల దేశ ప్రజల సంపదను ప్రధాన మోదీ ఆయన అనుచరులకు దోచి పెడుతున్నారన్నారు. ఇది అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమే అన్నారు. అభ్యుదయ వాదులంతా అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవిస్తుంటే, మోదీ ప్రభుత్వం ఒక దశలో అపహాస్యం చేస్తుందన్నారు. లౌకిక వ్యవస్థను కాపాడేందుకు వామపక్ష ఐక్యత ఎంతో అవసరమన్నారు. లక్షల కోట్లు పెద్దలకు గుమ్మరిస్తూ పేదలకు బిక్షం పెడుతున్నారు అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి, కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, జిల్లా సీపీఐ కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.


వాగ్దేవి డిగ్రీ కళాశాలకు అటానమస్



మాట్లాడుతున్న కళాశాల పాలకవర్గం

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంకు అనుబంధంగా పనిచేస్తున్న వాగ్దేవి డిగ్రీ కళాశాలకు యూజీసీ 2025- 26 విద్యా సంవత్సరం నుంచి అటానమస్ హోదా మంజూరు చేసినట్టు కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కళాశాలలో అందిస్తున్న అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధనకు సంతృప్తి చెందిన యూజీసీ స్వయం పాలిత హోదా (అటానమస్) కల్పించిందని వివరించారు. కళాశాలను స్థాపించిన 10 సంవత్సరాలలో నాక్ గ్రేడ్ సాధించటంతో పాటు 12 సంవత్సరాలలోనే అటానమస్ గుర్తింపు పొందామని తెలిపారు. అటానమస్ కళాశాలగా ప్రస్తుత విద్యా విధానంలో అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రణాళికను రూపొందించి అమలు చేసుకునేందుకు వీలుంటుందని స్పష్టం చేశారు. మూస విధానాలకు భిన్నంగా అత్యుత్తమ సిలబస్‌తో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దవచ్చని వివరించారు. ఇప్పటికే ప్రతి ఏడాది 90 శాతంకు పైగా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ, పల్నాడుజిల్లాలో ఉత్తమ కళాశాలగా గుర్తింపు పొందామని తెలిపారు. కళాశాలలో నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులు అటానమస్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, సూదా సురేష్‌బాబు, ఇస్కేపల్లి కృష్ణకిషోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్‌దారులకు నోటీసులు



రొంపిచర్ల: ఎన్‌టీఆర్ భరోసా దివ్యాంగుల పింఛన్‌లు అందుకుంటున్న మండలంలోని దివ్యాంగులకు నోటీసులు అందుతున్నాయి. విప్పర్లపల్లి గ్రామంలో 67 మంది వికలాంగులు ప్రతి నెలా పింఛన్‌లు అందుకుంటున్నారు. ఆయా పింఛన్ దారులకు మండల పరిషత్ కార్యాలయం నుంచి రెండు రోజుల క్రితం నోటీసులు అందాయి. తమ అంగవైకల్యాన్ని పింఛన్ పొందుతున్నవారు మరోసారి నిర్ధారణ చేసుకోవాలని ఈ నోటీసులో పేర్కొన్నారు. వికలాంగుల పింఛన్ పునః పరిశీలించేందుకు నిర్ధారణ అవసరమన్నారు. పునః పరిశీలనకు నరసరావుపేటలోని ఏరియా వైద్యశాల్లో హాజరు కావాలని నోటీసులో తెలిపారు. ఏరోజు, ఏ సమయంలో ఆసుపత్రికి రావాలో నోటీసులో పింఛన్ దారులకు తెలియజేశారు. ఆసుపత్రిలో పునః పరిశీలనకు నిర్ణీత సమయంలో హాజరు కాకపోతే ప్రభుత్వం నుండి అందే దివ్యాంగుల పింఛన్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.